అంతర్జాతీయ స్థాయిలో కాగితపు పరిశ్రమ నిర్వహణ

పేపర్‌టెక్ -2024 చైర్మన్ గణేశ్


సదస్సులో పాల్గొన్న చైర్మన్ గణేశ్

మాదాపూర్: దేశంలోని కాగితపు పరిశ్రమను అంతర్జాతీయ స్థాయికి తీర్చిదిద్దడమే లక్ష్యమని పేపర్‌టెక్ -2024 చైర్మన్ గణేశ్ తెలిపారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మంగళవారం పేపర్‌టెక్-2024 పేరిట అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ సదస్సులో కాగితపు పరిశ్రమ అభివృద్ధి, ఈ రంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవడం వంటి అంశాలపై చర్చించనున్నట్లు గణేష్ బడ్డీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ పేపర్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పవన్ అగర్వాల్, వైస్ ప్రెసిడెంట్ ఖన్నా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్వీఆర్ కృష్ణన్ ఇండియన్ న్యూస్ ప్రింట్ తయారీదారుల సంఘం అధ్యక్షుడు రాహుల్ ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

మరో మూడు సమ్మిట్‌లు...

కాగా మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మంగళవారం 23వ ఎనర్జీ ఎఫిషియెన్సీ సమ్మిట్, పవర్‌ప్లాంట్ సమ్మిట్ 2024, గ్రీన్ షుగర్ సమ్మిట్- 2024లు ప్రారంభమయ్యాయి. ఈ సదస్సులకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన 1600 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పవర్‌ప్లాంట్ సమ్మిట్ చైర్మన్, ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.కె ఘోష్ మాట్లాడుతూ థర్మల్ పవర్ ప్లాంట్లను పర్యావరణ హితంగా మార్చడం, ఇందుకు ఏఐ సహకారం తీసుకోవడంపై చర్చించనున్నట్లు తెలిపారు. భారతదేశంలో థర్మల్ పవర్ ప్లాంట్లు గణనీయంగా ఉన్నాయని తెలిపారు. విద్యుత్ రంగంలోనే కాకుండా వివిధ పరిశ్రమలలో సరళ విధానాలను అమలు చేయడంలో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ ముందంజలో ఉందని పవర్ ప్లాంట్ సమ్మిట్ కో చైర్మన్ ధర్మేంద్ర శ్రీవాస్తవ తెలిపారు. బయోగ్యాస్ చక్కెర మిల్లులకు గొప్ప అవకాశమని గ్రీన్ షుగర్ సమ్మిట్ చైర్మన్ 2024 చైర్మన్ గౌరవ్ గోయల్ తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ సదస్సులో మేకింగ్ ఇండియన్ షుగర్, బయోఫ్యూయల్స్ ఇండస్ట్రీ వరల్డ్ క్లాస్ ఇన్ గ్రీన్ థీమ్‌తో నిర్వహించనున్నట్టు తెలిపారు.

మంత్రి పొంగులేటిని కలిసిన పీఏసీ చైర్మన్ గాంధీ



గచ్చిబౌలి: శాసనసభ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా నియామకమైన ఎమ్మెల్యే గాంధీ మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ సందర్భంగా గాంధీని మంత్రి అభినందించారు. కొత్త బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, నాయకులు శ్రీనివాస్ యాదవ్, రఘునాథ్ యాదవ్, పృథ్వీ గాంధీ పాల్గొన్నారు.

దేవునికుంట ఆక్రమణలు తొలగించాలని హైడ్రాకు ఫిర్యాదు

శేరిలింగంపల్లి: గోపన్‌పల్లిలోని దేవునికుంటలో ఆక్రమణలు తొలగించాలని హైడ్రాకు కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఉపాధ్యక్షులు బి.దామోదర్‌రెడ్డి మంగళవారం ఫిర్యాదు చేశారు. గోపన్‌పల్లి సర్వే నంబర్ 22 లోని మేళ్ళకుంట (దేవునికుంట)లో ఓ సంస్థ నిర్మాణాలు చేస్తుందని, వెంటనే నిర్మాణాలను ఆపి కుంటను కాపాడాలని ఆయన హైడ్రాను కోరారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 30, పచ్చిమిర్చి 50, బెండ 70, కాకర 60, దొండ 60, దోస 40, ఆలు 40, చామ 60, కీర 40, బీర 70, వంకాయ 70, గోకర 50, బీన్స్ 120, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 100, ఉల్లి 60(కేజీ), ములక్కాయలు (3)20.

కర్రతో దాడి.. వ్యక్తి మృతి


విజయ్ (ఫైల్)

మాదాపూర్: కర్రతో దాడి చేసిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్ లేబర్ అడ్డా వద్ద ఉండే కూలీ మంద ఉపేంద్రని కొన్ని నెలలుగా విజయ్(35) అనే వ్యక్తి డబ్బులు ఇవ్వమని వేధించేవాడు. ఈ క్రమంలో ఉపేంద్ర విజయ్‌ను అంతమొందించాలనే ఆలోచనతో మరో స్నేహితుడు లింగం కోటయ్యతో కలిసి హరిజనబస్తీలో డబ్బులు ఇస్తామని అక్కడికి రప్పించారు. రాగానే విజయ్ తలపై కర్రతో బలంగా కొట్టడంతో అక్కడికక్కడే చనిపోయాడు. దీంతో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మృతుడు విజయ్ వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గచ్చిబౌలి: వట్టినాగులపల్లి ఔటర్ సర్వీస్ రోడ్డును ఆనుకొని ఉన్న మువీటవర్స్ ఫ్లైఓవర్ పక్కనే ఉన్న బావిలో ఓ మృతదేహం ఉందని స్థానికులు గచ్చిబౌలి పోలీసులకు మంగళవారం సమాచారం అందించారు. ఎస్ఐ మహేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. ఆ వ్యక్తి మూడు రోజుల క్రితమే చనిపోయి ఉంటాడని అన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత వ్యక్తులుంటే గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ 9490617237 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక ..

మాదాపూర్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ వంశీమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని బోరబండలో నివాసముంటున్న అంజయ్య(33) సెంట్రింగ్ పని చేసేవాడు. ఈనెల 9న సాయంత్రం పిల్లలకు భోజనం తీసుకువస్తానని చెప్పి ఇంటి నుంచి బయటికి వెళ్ళాడు. భార్య సురేఖ పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. తిరిగి మంగళవారం ఉదయం 11గంటలకు ఫోన్ చేయగా సత్యనారాయణ అనే వ్యక్తి ఫోన్ ఎత్తి నవభారత్ నగర్ చెత్త డంపింగ్ యార్డు వద్ద చెట్టుకు ఉరివేసుకున్నట్టు తెలిపాడు. దీంతో భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు ఆరుగురికి రూ. 2 వేల చొప్పున జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో ఆరు మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా, జడ్జి 06 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ట్రిపుల్‌ఐటీ.. ఏఐలో మేటి



- ట్రిపుల్‌ఐటీలోని 'సీఐఈ' దేశంలోనే అతిపెద్ద అకడమిక్ ఇంక్యుబేటర్
- లాభాపేక్షలేని పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో ఏర్పడిన ఉన్నత విద్యాసంస్థ
- ఇదీ ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ప్రగతి

దేశంలో 'ఏఐ'లో నంబర్‌వన్ ఇన్‌స్టిట్యూట్‌గా గుర్తింపు

రాయదుర్గం: దేశంలోని ట్రిపుల్‌ఐటీలకు రోల్ మోడల్‌గా నిలుస్తోంది గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్. జాతీయ, అంతర్జాతీయంగా గుర్తింపును సాధిస్తూ ప్రతి ఏటా విద్య, పరిశోధనా రంగాలలో నిష్ణాతులను అందిస్తూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది.యూజీసీ గుర్తింపు, ఏఐసీటీఈ ఆమోదం పొందిన, న్యాక్ (గ్రేడ్ ఏ) గుర్తింపును ఈ ఉన్నత విద్యాసంస్థ పొందింది. ప్రతియేటా దాదాపు 100 శాతం ప్లేస్‌మెంట్స్ కల్పించడంలోనూ ముందుంది.1998లో ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ఏర్పడింది. ఇటీవలే సిల్వర్‌జూబ్లీ వేడుకలు చేసుకుంది. కాగా ఈ నెల 2వ తేదీన 27వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా జరిగింది.

నాడు 50 మంది విద్యార్థులు.. నేడు 2వేల మంది

- ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ఆరంభంలో కేవలం 50 మంది విద్యార్థులతో మొదటి బ్యాచ్‌ను ప్రారంభించారు.



- ప్రస్తుతం 28 ప్రోగ్రాంలలో 2వేల మంది వరకు చదువుతున్నారు.
- ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌కు ఇప్పటి వరకు 6వేల మంది పూర్వ విద్యార్థులు ఉన్నారు

'ఏఐ'లో గుర్తింపు

- గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ భారతదేశంలోని ఏఐ (కంప్యూటర్ విజన్ మెషిన్ లెర్నింగ్, డేటా మైనింగ్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్‌లో నంబర్ 1 ఇన్‌స్టిట్యూట్‌గా గుర్తింపును సాధించింది
- ఆసియా ఖండంలో 2వ స్థానంలో కొనసాగుతోంది.
- ఇంటెల్ సంస్థ సహకారంతో 29 పరిశోధనా కేంద్రాలు, ఏఐ డేటాబ్యాంక్‌లు, డేటా అనలిటిక్స్(టీఐహెచ్-డేటా) కోసం టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్, అప్లెడ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, రీసెర్చ్ సెంటర్ వంటి వాటితో అభివృద్ధి పథంలో దూసుకెళుతోంది
- టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) నిధులతో 2015లో ఏర్పాటైన ట్రిపుల్‌ఐటీ కోహ్లి సెంటర్ ఆన్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్ ప్రముఖ కేంద్రంగా కొనసాగుతోంది.
- దేశంలో మొదటిసారిగా లాభాపేక్షలేని పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్‌లో ఏర్పడిన మొదటి ఉన్నత విద్యా సంస్థ.
- దేశంలోని ట్రిపుల్ ఐటీలకు ఇది రోల్ మోడల్‌గా మారింది
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ సంస్థకు గచ్చిబౌలిలో 66 ఎకరాలు కేటాయించారు.
- 2001లో ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ డీమ్డ్ యూనివర్సిటీగా గుర్తింపు పొందింది
- మొదట్లో ప్రత్యేక అధికారిగా రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి అజయ్‌ప్రకాశ్ సాహ్నిని నియమించారు.
- ట్రిపుల్‌ఐటీ మొదటి డైరెక్టర్‌గా నరేంద్ర ఆహూజా 1998 నుంచి 2002 వరకు ఉన్నారు

ఆ తర్వాత ప్రొఫెసర్ రాజీవ్ సింఘాల్‌ను 2002 మార్చి నుంచి 2013 ఏప్రిల్ 10 వరకు కొనసాగారు.

- ఈ సంస్థ గవర్నింగ్ కౌన్సిల్‌కు ప్రొఫెసర్ రాజ్‌రెడ్డి చైర్మన్‌గా చేశారు
- 2013 నుంచి డైరెక్టర్‌గా ప్రొఫెసర్ పీజే నారాయణన్, ప్రస్తుతం కొత్త రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ కేఎస్ రాజన్ వ్యవహరిస్తున్నారు.
- ట్రిపుల్‌ఐటీలో 26 రీసెర్చ్ డెవలప్‌మెంట్ సెంటర్స్, మరో 5 కంబైన్డ్ సెంటర్స్ ఉన్నాయి.

ట్రిపుల్‌ఐటీ 'సీఐఈ'కి 15 ఏళ్లు..

- ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ద్వారా ఏర్పాటు చేసిన సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (సీఐఈ) దేశంలోనే అతిపెద్ద అకడమిక్ ఇంక్యుబేటర్లలో ఒకటిగా ఉంది.
- ఇది అటల్ ఇన్నోవేషన్ సెంటర్, బీఐఆర్ఏసీ బయోనెస్ట్ ఇంక్యుబేటర్ సంస్థగా గుర్తింపు సాధించింది.
- సీఐఈలో 300 కంటే ఎక్కువ స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేసింది. 2వేల మందికి పైగా యువతకు ఉపాధిని కల్పించింది. 80 ఇంక్యుబేట్ కంపెనీలు, వాటిలో దాదాపు 350 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు
- ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ భారీ టార్గెట్ దిశగా 250 మందికిపైగా అధ్యాపకులు, 5వేలకు పైగా విద్యార్థులను చేర్చుకొని మరింత ప్రగతివైపు సాగేలా ప్రణాళికను రూపొందించుకుంది.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి


వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డికి వినతి పత్రాన్ని ఇస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మంగళవారం జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయనతో సమావేశమై నానక్‌రాంగూడ, నేతాజీనగర్, గోపన్‌పల్లి, నల్లగండ్ల హుడా కాలనీలలో అభివృద్ధి పనులు, సమస్యల గురించి వివరించారు. ఇటీవల కురిసిన వర్షాలకు సీసీ రోడ్లు దెబ్బతిన్నాయని, చిన్నపాటి వర్షం పడినా గుంతలలో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనులు పూర్తి చేయడానికి నిధులు కేటాయించాలని ఆయన కోరారు. ఇందుకు జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు గంగాధర్‌రెడ్డి తెలిపారు. డివిజన్‌లో ఇటీవల నిర్వహించిన బస్తీబాట కార్యక్రమంలో కాలనీలు ,బస్తీలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు హన్మంతునాయక్, రాజునాయక్ పాల్గొన్నారు.

2025 నాటికి రెట్టింపుస్థాయిలో ఉద్యోగుల కల్పనకు ప్రణాళిక



ప్లాన్‌ఫుల్ సంస్థ సీఈఓ గ్రాంట్ హాలోరన్

చందానగర్: 2025 నాటికి రెట్టింపుస్థాయిలో పెట్టుబడి పెడుతూ...ఉద్యోగుల సంఖ్య పెంపునకు తగిన ప్రణాళిక రూపొందించినట్టు 'ప్లాన్‌ఫుల్' సంస్థ సీఈఓ గ్రాంట్ హాలోరన్ వెల్లడించారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఓ హోటల్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో మా గ్లోబల్ ఆర్ అండ్ డీ సెంటర్‌ను మరింత అత్యాధునిక తరహాలో అభివృద్ధి చేయడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్లాన్‌ఫుల్ సంస్థ హెడ్ క్వార్టర్స్ శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉందని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో సోమవారం నూతన కార్యాలయాన్ని ప్రారంభించినట్టు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్లాన్‌ఫుల్ సంస్థ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ సంజయ్ వ్యాస్, చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్ స్టీవ్ వెల్ష్, చీఫ్ పీపుల్ ఆఫీసర్ మెలిస్సాద్రూత్ పాల్గొన్నారు.

హైడ్రా ఫిర్యాదు.. కేసులు నమోదు

మాదాపూర్: మాదాపూర్‌లోని సున్నం చెరువులో కూల్చివేతలను అడ్డుకున్న స్థానికులపై మాదాపూర్ పోలీసులు కేసులు నమోదు చేశారు.హైడ్రా అధికారులు ఆదివారం మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విధులకు ఆటంకం కలిగించినందుకుగాను ఎ1 వెంకటేశ్(35) డ్రైవర్, ఎ2 లక్ష్మి(28) కూలీ, ఎ3 నరేష్(28) డ్రైవర్. వీరు ముగ్గురు కిరోసిన్ పోసుకుని విధులకు ఆటంకం కలిగించినందుకు మాదాపూర్ పోలీసులు కేసునమోదు చేశారు.

డేటా ఎనలిటిక్స్, కృత్రిమ మేధ కీలకం


సమావేశంలో క్రెడిట్ సేఫ్ గ్రూప్ అధికారి జాన్‌సిరి, టెక్నాలజీ మేనేజింగ్ డైరెక్టర్ కిషోర్‌రెడ్డి కంచర్ల

మాదాపూర్: భారతదేశంలో వ్యాపార సమాచారం మార్కెట్ పెరిగిందని, సాంకేతిక ఆవిష్కరణలకు డేటా ఎనలిటిక్స్, కృత్రిమ మేధ కీలకమన్నారు. వ్యాపార క్రెడిట్ ఇంటెలిజెన్స్ భవిష్యత్‌ను వేగవంతం చేసేందుకు క్రెడిట్‌సేఫ్ తన హైదరాబాద్ కార్యాలయ వ్యూహాత్మక విస్తరణను మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా క్రెడిట్ సేఫ్ గ్రూప్ అధికారి జాన్ సిరి, టెక్నాలజీ మేనేజింగ్ డైరెక్టర్ కిషోర్‌రెడ్డి కంచర్ల మాట్లాడుతూ 2027 నాటికి ఉద్యోగులకు పెంచే ఆలోచనలో ఉన్నామని తెలిపారు. డైరెక్టర్ త్రిభువన్ యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

'ఎస్కీ'లో 'కిక్ స్టార్ట్ టు సక్సెస్'


జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీనియర్ విశ్రాంత పోలీసు అధికారి డా.ఉమాపతి

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో మంగళవారం 'కిక్ స్టార్ట్ టు సక్సెస్' పేరిట ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీనియర్ విశ్రాంత పోలీసు అధికారి డాక్టర్ ఉమాపతి పాల్గొన్నారు. పీజీ డిప్లొమో ఇన్ మేనేజిమెంట్ స్టడీస్ నూతన విద్యార్థుల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ నిత్య నూతనంగా ఉండాలని అపుడే లక్ష్యాలను చేరుకుంటారన్నారు. విద్యార్థులు డిబేట్స్, గ్రూప్ డిస్కషన్స్, మంచి పుస్తకాలు చదవడం, పేపర్ రీడింగ్ అండ్ రైటింగ్, సంఘంలో అందరితో మాట్లాడటం, క్రమశిక్షణ పాటించడం, కొత్త విషయాలను నేర్చుకోవాలనుకోవడం ఉన్నతస్థానంలో నిలబెడతాయన్నారు. 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వర రావు మాట్లాడుతూ తరగతుల ప్రారంభానికి ముందు విద్యార్థుల మానసిక పరిపక్వతను పెంపొందించే విధంగా జీవన సమతుల్యత, పని నిర్వహణలో మార్పు, వ్యక్తిత్వ వికాసం, వ్యాపార నైతికత, విలువలు, ఆర్థిక నైపుణ్యాలు తదితర విషయాలపై 16 రోజుల పాటు నిపుణులతో అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. జగన్‌మోహన్‌రెడ్డి, ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ చంద్రకళ, డాక్టర్ రాజేశ్వరి, రమావత్‌కిషన్, డాక్టర్ సింధు, రాజు, విద్యాసాగర్, రాజశేఖర్‌రెడ్డి, ఆదినారాయణ, రఘువీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్ బుచ్చిరెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి: గణేశుల నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆ సమితి శేరిలింగంపల్లి కన్వీనర్ పోరెడ్డి బుచ్చిరెడ్డి తెలిపారు. మంగళవారం తారానగర్‌లో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ చెరువులు, కుంటలలో ఏర్పాటు చేసిన నిమజ్జన కేంద్రాలను పరిశీలించాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి అడ్వైజర్ బాల అశోక్, కో కన్వీనర్ మణిభూషన్, నాయకులు మహిపాల్‌రెడ్డి, డివిజన్ కన్వీనర్లు శాంతి భూషణ్‌రెడ్డి, రవి గౌడ్, శ్రీశైలం కురుమ, టి.రఘు, సాయిరాం గౌడ్,రాజేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు గొల్లపల్లి రాంరెడ్డి, శ్రీధర్‌రావు, కమలాకర్‌రెడ్డి, ఆంజనేయులు, భూపాల్ రెడ్డి, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

జై గణేశా.. జైజై గణేశా..


గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో..


నానక్‌రాంగూడలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

శేరిలింగంపల్లిజోన్ బృందం: గణేశ్ నవరాత్రోత్సవాలు వాడవాడలా వైభవంగా కొనసాగుతున్నాయి. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, మాదాపూర్, హఫీజ్‌పేట్ డివిజన్లలోని కాలనీలు, బస్తీలు, ఆలయాలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలో ప్రతిష్ఠించిన వినాయక మండపాల వద్ద ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది. పెద్ద సంఖ్యలో భక్తులు గణేశుడిని దర్శించుకుంటున్నారు. కాగా హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా సాయంత్రం రాష్ట్రీయ కళామంచ్ ఆధ్వర్యంలో దాండియా, కోలాటం ఉత్సాహంగా సాగాయి. కాగా ఇస్కాన్ భజన బృందం ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి.

గణేష్‌గడ్డలో..

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం గణేశ్‌గడ్డ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా మంగళవారం దేవస్థానంలో గణనాథుని గులాబీ వర్ణంతో అలంకరించారు. అనంతరం ఆలయంలో పూజలు, హోమం చేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ ఆవరణలో నిత్య అన్నదానం కొనసాగుతున్నట్లు ఆలయ ఇంచార్జి ఈఓ శశిధర్, జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్ ఈ సందర్భంగా తెలిపారు.


గులాబీ వర్ణంలో గణేష్‌గడ్డ గణనాథుడు


టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో భజనలు


కొండాపూర్‌లో..


ఇజ్జత్‌నగర్ విండ్‌మిల్స్ అపార్ట్‌మెంట్‌లో హోమంలో పాల్గొన్న అపార్ట్‌మెంటువాసులు


కొండాపూర్‌లో..






హెచ్‌సీయూలో ఏబీవీపీ ఆధ్వర్యంలో పూజ... ఇస్కాన్ ప్రతినిధుల భజనలు


హోమం చేస్తున్న అర్చకులు